# ముందుమాట

బ్రహ్మదేవుని చతుర్ముఖాలనుండి పురాణాలు, తరువాత వేదాలు వినిస్సృతాలైనట్లు తెలుస్తుంది. కాగా పురాణాల అనాదిత్వం పావనత్వం విద్యోతిత మవుతుంది. ఏనాటినుంచో సజీవంగా వెలిగేదే పురాణమంటారు. 'పురాపి నవం పురాణం'- ఎంత పాతదైనా పురాణం సరికొత్తగానే ఉంటుందన్నమాట!

సర్గం, ప్రతిసర్గం, వంశం, మన్వంతరం, వంశానుచరితం - అని పురాణాలు అయిదు లక్షణాలు కలిగి ఉంటాయి. ఈ లక్షణాలతో కూడిన పురాణాలు పద్దెనిమిది. ఉపపురాణాల సంఖ్యకూడా అంతే. ఈ పురాణాలన్నీ వేదవ్యాస మహర్షి విరచితాలే అని ప్రతీతి. ఇవి భిన్న కర్తృకాలు అనే ప్రవాదం కూడా ఉన్నది. ఏమైనా పురాణాలు ప్రాచీన సంస్కృతి సంప్రదాయాలకు ఆదర్శం లాంటివే కాకుండా, పూర్వ రాజవంశాలను గురించికూడ తెలపడంవల్ల ఒక విధంగా చరిత్రగ్రంథాలుగా కూడా ఉపకరిస్తాయి.

కథలద్వారా ప్రజలకు నీతి ధర్మాలు ఉపదేశించడం వీటి పరమాశయంగా కనిపిస్తుంది. భాగవత రచనవల్ల వ్యాసభగవానుడికి మనశ్శాంతి చేకూరిందనడంలో పురాణ ప్రభావం ఏమిటో విదిత మవుతుంది.

అష్టాదశ పురాణాలలో ప్రశస్తి వహించిన శ్రీమద్భాగవతాన్ని బమ్మెరపోతనామాత్యులు తెలుగులోనికి అనువదించి ఆంధ్రలోకానికి మహోపకారం చేశారు. పరమభాగవతోత్తముడైన పోతనగారు తన సహజ పాండిత్యముతో అనితరభక్తితో భాగవతాన్ని రచించారు. మహాతపస్వి పోతరాజుగారి లేఖిని నుండి జాలు వారిన కవితా స్రవంతి ఆంధ్ర జనహృదయ కేదారాలను తడుపుతూ తాపత్రయాన్ని హరిస్తున్నదనడం సత్యం. భాగవతంలోని ప్రతి పద్యం ఎంతో హృద్యం. తెలుగునాట పోతనగారి పద్యం నోటికి రాని పండితుడు గాని, పామరుడుగాని లేడంటే అతిశయోక్తి కాదు.

ఇలా తెలుగునాట ప్రముఖస్థానాన్ని అలంకరించిన ఆంధ్రమహాభాగవతం అక్షరాస్యులందరికీ సులభ గ్రాహ్యం అయ్యేందుకు తి.తి.దేవస్థానంవారు ప్రముఖ విద్వాంసులచేత సులభశైలిలో తాత్పర్యాలు వ్రాయించి, ముద్రించారు.

ప్రధాన సంపాదకులైన డా॥ జంధ్యాల పాపయ్యశాస్త్రి (కరుణశ్రీ) గారికి, ఆయా సంపుటాల తాత్పర్య రచయితలకును మా అభినందనలు. తి.తి.దేవస్థానం వారు ప్రచురించిన పోతన భాగవత సంపుటాల ప్రతులన్నీ చెల్లిపోయినందున పాఠకుల సౌకర్యార్థమై పరిష్కరించి పునర్ముద్రించటం జరిగింది. పాఠకులు యథాపూర్వం ఆదరించగలరు.

శ్రీనివాసుని కృపతో తిరుమల తిరుపతి దేవస్థానంవారు చేస్తున్న ధార్మిక గ్రంథ ప్రచురణలపట్ల తెలుగునాట బహుళామోదం లభిస్తున్నందుకు సంతోషం.

**కార్యనిర్వహణాధికారి,**

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి.